క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వారిపై కేసు నమోదు చేస్తున్న మహిళా పోలీసులు

మునగపాక : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మునగపాక సచివాలయ మహిళా పోలీసులు వరలక్ష్మి, శ్రావణి సంయుక్తంగా కోరారు. మునగపాకలో ప్లాస్టిక్ వాడుతున్న వారిపై శుక్రవారం కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం సరికాదన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ భూతానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లను వారు తగులబెట్టారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పంచాయతీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు



రాజుపేటలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మునగపాక : అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని రాజుపేటలో పర్యటించారు. గ్రామాల్లో జరిగే తీర్థ మహోత్సవాల్లో పేకాట, కోడి పందాలాట, లాటరీ బళ్లలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అశ్లీల నృత్యాలు ప్రదర్శించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్ఐ చల్లా బీమరాజు, రాజుపేట సర్పంచ్ కిలాడి దేముడు ఉన్నారు.

భరతమాతకు పూజలు



కొండకర్లలో భరతమాత చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): దేవతలు నడయాడిన నేల భరతభూమి అని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి రమణ అన్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ భగవంతుని అవతారాలు భరత గర్భంలో జన్మించాయని తెలిపారు. వేదాలు కూడా భరత గర్భంలో వికసించాయన్నారు. సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, మండల కన్వీనర్ రమణ, కట్టమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నక్కపల్లి : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు. శుక్రవారం వారు నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ పనితీరు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందని, లబ్ధిదారులతో నిర్మాణాలు పూర్తిచేయించే బాధ్యత, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహనిర్మాణశాఖ సిబ్బందిదేనన్నారు. ప్రభుత్వం ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలు చేయించాలని ఆదేశించిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు.

ముగ్గురికి గాయాలు

నక్కపల్లి : జాతీయ రహదారిపై వేంపాడు సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వెంకటేష్ అనే వ్యక్తి నక్కపల్లి నుంచి వేంపాడు వెళ్తుండగా లోవరాజు మరో వ్యక్తి బైక్‌పై రాంగ్ రూట్లో వచ్చి ఈ బైక్‌ను ఢీకొట్టాడు. రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్న వెంకటేష్, లోవరాజుల తోపాటు మరో వ్యక్తి గాయపడ్డారు. నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- వెంకటనగరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



నాడు- నేడుతో అభివృద్ధి చెందిన పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, రాష్ట్రం అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల వెంకటనగరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం నాడు - నేడు పథకంలో రూ.23 లక్షలతో నిర్మించిన పాఠశాలఅభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. మండల పరిషత్ నిధులు రూ. 4 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాల్లో తాగునీటి ప్లాంటును పరిశీలించారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై గ్రామస్తులను అడిగి తెల్సుకున్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి అందుతున్న పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందించారు. పథకాలు అందరికీ అందుతున్నాయని గ్రామస్తులు చెప్పడంతో ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామానికి ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలు, అభివృద్ధి పైన మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను సభకు చదివి వినిపించారు. గ్రామంలో చేయవలసిన అభివృద్ధి పనులు దశల వారీగా చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, లీడ్‌క్యాప్ డైరెక్టర్ వేమగిరి కళ్యాణి లక్ష్మణరావు, పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు సూర్యచక్రం, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, తహసీల్దార్ జె.జయప్రకాష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనతకు చెక్



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల : పిల్లలు రక్తహీనత బారిన పడకుండా తగిన పోషకాహారాన్ని అందివ్వాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. కోటవురట్ల గ్రామ సచివాలయంలో స్వాభిమాన్ కార్యాక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. అంతే కాకుండా బాల్య వివాహాలను నిరోధించేందుకు ఐసీడీఎస్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పిల్లలు ఎదిగే సమయంలో సరైన పోషకాలు అందకపోవడం వల్ల రక్తహీనత వస్తుందన్నారు. ఇంట్లో లభించే కూరగాయలు, పప్పు దినుసులతోనే తక్కువ ఖర్చుతో పోషకాహారాన్ని తయారు చేసుకోవచ్చన్నారు. ప్రధానంగా పరిశుభ్రత పాటించడం, గోళ్లు శుభ్రపరుచుకోవడం, మంచి ఆహార నియమాలను పాటించడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. బాల్య వివాహాల వల్ల మానసికమైన ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతారన్నారు. పిల్లలకు సరైన వయస్సు వచ్చినపుడు మాత్రమే వివాహాలు చేయాలని, వారికి మంచి భవిష్యత్ వచ్చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఉన్నతంగా చదివించడం ద్వారా బంగారు భవిత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ పుట్రేవు సూర్యారావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో కొరుప్రోలు సర్పంచ్ మృతి



సర్పంచ్ లోవలక్ష్మి (ఫైల్)

ఎస్.రాయవరం : అనారోగ్యం కారణంగా కొరుప్రోలు గ్రామ సర్పంచ్ పోలవరపు లోవలక్ష్మి (37)శుక్రవారం మృతిచెందారు. 10 రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. ఆమె మృతితో దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ ప్రకటించి సంతాపం తెలిపారు. గ్రామ సచివాలయ అధికారులు, వలంటీర్లు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మేలు జాతి విత్తనాలతో అధిక లాభాలు



రైతులకు నువ్వు పంటపై సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

యలమంచిలి : రైతులు నువ్వు పంటలు నాటేటప్పుడు యజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్త టి.తులసి అన్నారు. విశాఖపట్నం ఆత్మ వారి సౌజన్యంతో కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రైతులకు శుక్రవారం నువ్వు విత్తనాలు పంటల పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల బృందం మాట్లాడుతూ నువ్వు పంటలు నాటినప్పుడు మేలుజాతి నువ్వు విత్తనాలు 66 శారద రకం వేయాలని, ఆఖరి దుక్కులో యూరియా ఫాస్ఫేట్ పరిమితికి మించి వాడరాదని అన్నారు. రైతులు అందరికీ నువ్వు విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ అధికారులు ఆశా దేవి, శిరీష, మండల వ్యవసాయాధికారి ఉమాదేవి, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో స్ప్రేయింగ్ మేలు



డ్రోన్ స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

రాంబిల్లి : వరి సహా పలు పంటలపై ఆశించిన తెగుళ్లు, పురుగుల నివారణకు డ్రోన్ సాయంతో పిచికారీతో మేలు జరుగుతుందని హరిపురం కేవీకే యాంత్రీకరణ శాస్త్రవేత్త పి. శ్రీకాంతగౌడ అన్నారు. కుమ్మరాపల్లిలో శుక్రవారం చెన్నయ్‌కు చెందిన గరుడ డ్రోన్స్ వారి సహకారంతో వరి పైరుపై డ్రోన్ సాయంతో పిచికారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంతగౌడ మాట్లాడుతూ ఎకరా పొలంలో కేవలం ఐదు నిమిషాల్లో పిచికారీ పూర్తవుతుందన్నారు. ఎకరాకు రూ.500 మాత్రమే డ్రోన్ స్ప్రేయింగ్‌కు ఖర్చవుతుందని సేద్యపు శాస్త్రవేత్త వాన ప్రసాదరావు అన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, డ్రోన్ స్ప్రేయింగ్‌తో పూర్తి స్థాయిలో పంటపై మందు ద్రావణం పడడంతో పురుగులు నశిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీటీ సామాజిక అధికారి శిగిరెడ్డి నాగేశ్వరరావు , కుమ్మరాపల్లి గ్రామ నాయకుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు పలువురు రైతులు పాల్గొన్నారు.

పోలీసు కానిస్టేబుల్ రాతపరీక్ష కేంద్రం తనిఖీ



మునగపాకలోని కానిస్టేబుల్ రాతపరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్బవరం ఎస్ఐ రంగనాథన్

మునగపాక : పోలీసు కానిస్టేబుల్ రాతపరీక్షను గట్టి బందోబస్తు నడుమ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని సబ్బవరం ఎస్ఐ రంగనాథన్ తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేట డావిన్సీ అంతర్జాతీయ పాఠశాలతో పాటు మునగపాకలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా గుర్తించిన విషయం తెలిసిందే. దీంతో సంబంధిత కేంద్రాలను ఆయన పరిశీలించారు. రాత పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమయ్యే సదుపాయాలు కేంద్రాల్లో ఉన్నాయా లేదా పరిశీలించారు. అలాగే పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థులకు తాగు నీరు, బాత్‌రూమ్ సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. మొత్తం 540 మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాయనున్నారన్నారు. ఈ పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఆయన వెంట పోలీసు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విస్తృత ప్రచారం అవసరం



రహదారి భద్రత వారోత్సవాలు అవగాహనా ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : మండలంలో గల వెంకటనగరం గ్రామంలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో జరిగిన వారోత్సవాలు ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రయాణాలు సురక్షితంగా చేయాలని అన్నారు. ముఖ్యంగా యువత వాహనాలపై ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. సంబంధిత అధికారులు రహదారి భద్రతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. యువత ప్రయాణాల్లో వేగాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రజల్లో వారోత్సవాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సూచించారు.

వలంటీర్లపై తప్పుడు వార్తలు సరికాదు

–యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): సేవా మార్గంలో పని చేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న వలంటీర్లను విమర్శిస్తూ వార్తలు రాయడం సరికాదని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వలంటీర్లపై విషపు రాతలు రాస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తూ కుల, మత, రాజకీయాలకుఅతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న వలంటీర్ల సేవలు అమోఘం అని అన్నారు. వలంటీర్ల వ్యవస్థ దేశ వ్యాప్తంగా ప్రసంశనీయంగా మారిందన్నారు. ఒకటో తేదీనే పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో చేసిన సేవలు ఆదర్శనీయం అని అన్నారు. వలంటీర్ల సేవల పట్ల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, అటువంటి వలంటీర్లపై తప్పుడు రాతలు సరికాదని హితవు పలికారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎంపీపీ జెడ్పీటీసీ లాలం రాంబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, పార్టీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, పార్టీ మండల నాయకులు కోన బుజ్జి, బలిరెడ్డి శ్రీను, రాజాన విజయ్, తోట వెంకటేశ్, లాలం శ్రీను పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బంది నిరసన

ఎస్.రాయవరం : పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సచివాలయ ఏఎన్ఎంలను, పీహెచ్ సీ సిబ్బందిపై తరచూ దుర్భాషలాడుతున్నారని పీహెచ్‌సీ ఎదుట శుక్రవారం నిరసనకు దిగారు. విధుల్లో చేరినప్పటి నుంచి సిబ్బందిపై చిన్నచూపుతో ఉన్న వైద్యులు తమని వేధిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారులు వచ్చి తమకు న్యాయం చేసి తమ విధులు సక్రమంగా చేసుకునేలా చూడాలని కోరారు. విషయం తెలుసుకున్న అనకాపల్లి జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో ధర్నాకు దిగిన సిబ్బందిని వెంటనే తమ కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో డీఎంఅండ్‌హెచ్‌వోను కలిసిన నిరసనకారులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలి

–రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు కాంతారావు



కొత్తపేట హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిటీ మెంబర్ కాంతారావు

యలమంచిలి : పాఠశాలలో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ మెంబర్ బి.కాంతారావు అన్నారు. శుక్రవారం యలమంచిలి పట్టణంలో కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మంచి పోషకాలు ఉన్న ఆహారాన్ని అందించడం ద్వారా విద్యార్థులు మానసికంగా దృఢంగా చక్కని మేదస్సుతో కూడిన విద్యఅభ్యసిస్తారని అన్నారు. పాఠశాలలో ప్రభుత్వం అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన మధ్యాహ్న భోజన పథకం మెనూతో అందిస్తోందని ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు మెనును అమలు పరచడంలో శ్రద్ధ చూపాలని అన్నారు. యలమంచిలి పట్టణంలో బజారులో ఉన్న రేషన్ దుకాణం, లైనుకొత్తురు వద్ద ఉన్న పౌరసరఫరాల గోడౌన్‌లో ఉన్న సరుకును తనఖీ చేశారు. ప్రజలకు సకాలంలో రేషన్ అందుతుందా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.

కార్మికుల ఆందోళన



ధర్నా చేస్తున్న హైటెక్ పరిశ్రమ కార్మికులు

రాంబిల్లి: సెజ్‌లో గల హైటెక్ పరిశ్రమ కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. 8 గంటలు పనివేళలు అమలు చేయాలని, కనీస వేతనాల చట్టం అమలు చేయాలని నిబంధనల ప్రకారం ఇతర సదుపాయాలను కల్పించాలంటూ కార్మికులు ధర్నాకు దిగారు. వీరికి సీఐటీయూ నాయకులు కె. సోమునాయుడు, తాతయ్య తదితరులు మద్దతు తెలిపారు. న్యాయబద్ధమైన కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఎస్ఐ దీనబంధు, పూడి గ్రామ నాయకులు లాలం వాసు పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ నెల 27 లోపు తగు చర్యలు తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు తెలపడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

మూడేళ్లలో ఎంతో అభివృద్ధి



చిప్పాడలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): గడిచిన మూడేళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి ఈ రోజు ప్రజల వద్దకు వెళ్లగలుగుతున్నామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని భోగాపురం సచివాలయం పరిధిలో ఉన్న చిప్పాడ, ఉద్దపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. నవ రత్నాల ద్వారా ప్రజలకు అందుతున్న పథకాలు వివరించారు. నవ రత్నాల కరపత్రాలను అందజేశారు. ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా సచివాలయ సిబ్బందిని, తమను గానీ నేరుగా సంప్రదించవచ్చన్నారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, పార్టీ అధికార ప్రతినిధి పిన్నంరాజు వాసు, పార్టీ మండల నాయకులు కోన బుజ్జి, సర్పంచ్ నాయుడు బాబు, మాజీ సర్పంచ్ రెడ్డి శ్రీను, బలిరెడ్డి శ్రీను, రాజాన విజయ్, తోట వెంకటేశ్, లాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించండి



డ్రైవర్లకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

యలమంచిలి : రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు తూచా పాటించాలని యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా యలమంచిలి పట్టణం భాష్యం స్కూల్లో ఆటో బస్సు డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరు మానవత దృక్పథంతో వ్యవహరించి సాటి మనుషులకు సహాయపడాలని, ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, వాహనాల్లో ప్రయాణించేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని, మత్తు పదార్థాలు సేవించి డ్రైవింగ్ చేయరాదని, మైనర్ యువకులకు వాహనాలు ఇవ్వరాదని, పట్టణంలో ట్రాఫిక్ అంక్షలు పాటించాలని, ఓవర్ స్పీడ్ రైడింగ్ చేయరాదని రోడ్డు ప్రమాదంలో ఎవరైనా గాయపడితే వారికి సపర్యలు చేసి పోలీసులకు సమాచారం అందజేయాలని అన్నారు. ఈ సందర్భంగా యలమంచిలి ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సమావేశంలో యలమంచిలి పట్టణ మండంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ



ముగ్గులపోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మండలంలోని మూలపేటలో జరిగిన శ్రీరాముల వారి తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన గురువారం రాత్రి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. అలాగే గ్రామీణ పండుగలు ఐక్యతను చాటి చెబుతాయన్నారు. కార్యక్రమంలో రామాలయం కమిటీ అధ్యక్షులు ఆడారి కాశీరావు, వార్డు సభ్యులు అమ్మాజీ, హైమావతి, పెద్దలు ఈశ్వర అప్పారావు, జేకే బ్రదర్స్, మధు, పైడికొండ, నూకరాజు, నాగేశ్వరరావు, సంజీవరావు, ఆదికుమార్, మోహనరావు పాల్గొన్నారు. తిమ్మరాజుపేటలో జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు ఉపసర్పంచ్ జగన్, పెద్దలు కృష్ణారావు, శ్రీనివాసరావు, రాము బహుమతులు అందజేశారు.

రక్తహీనత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : మహిళల్లో రక్తహీనత లోపం లేకుండా చూడాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. శుక్రవారం వాడ్రాపల్లి సచివాలయంలో స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్న బాలికలు రక్తహీనతకు గురికాకుండా తగు జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు తగవన్నారు. 18 సంవత్సరాలు నిండిన తరువాతే మహిళలకు వివాహం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మపాలెంలో క్రీడా పోటీలు



జాతరలో సందర్భంగా జరిగిన పోటీల్లో తలపడుతున్న కాకినాడ,పూడిమడక జట్లు

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెం గ్రామంలో శ్రీ వల్లభేశ్వరస్వామి జాతరను పురస్కరించుకుని శుక్రవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలకు విశాఖపట్నం, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల క్రీడాకారులు హాజరయ్యారు. రోజంతా ఉత్సాహ భరితంగా నిర్వహించిన పోటీలతో గ్రామంలో సందడి నెలకొంది. జాతరను పురస్కరించుకుని పురవీధుల్లో విద్యుదలంకరణలు, తీర్థ సామాగ్రి, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు.తిమ్మరాజుపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ఆమె శుక్రవారం పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, డీపీ అనితలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉమ్మలాడలో వానరాల స్వైర విహారం



ఉమ్మలాడ రహదారిపై కోతులు

మునగపాక: ఉమ్మలాడలో వానరాల స్వైర విహారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోతులు గుంపులు గుంపులుగా రహదారులపై తిరగడంతో పాటు పొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయంటూ రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు ఇళ్లముందు వుంచిన సామాగ్రిని ధ్వంసం చేయడంతో పాటు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయంటూ గగ్గోలు పెడుతున్నారు. అంతేకాకుండా పిల్లలపై దాడులు చేస్తున్నాయంటూ వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వానరుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.